క్లుప్తంగా

శ్రీకార కొడి ఉత్సవం రేపు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో వార్షిక ఉత్సవాలకు సంబంధించి బుధవారం సాయంత్రం శ్రీకార కొడి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త రాధాకృష్ణా రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలన్నారు.

మహిళా కార్యకర్తకు నివాళి



నాచారమ్మకు నివాళులర్పిస్తున్న విజయానందరెడ్డి

శ్రీరంగరాజపురం: మండలంలోని 49 కొత్తపల్లి మిట్ట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మహిళా సీనియర్ నాయకురాలు నాచారమ్మ అనారోగ్యంతో మరణించారు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజక వర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామానికి వెళ్లి ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ తరపున ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, ఎంపీపీ సరిత, మండల కన్వీనర్ మణి, సర్పంచ్ ఢిల్లీ, జిల్లా క్రియాశీలక కార్యదర్శి విజయబాబు, చిత్తూరు టౌన్ అధ్యక్షుడు కేపీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



సంతబయలు గ్రామంలో బోరు వేయిస్తున్న సర్పంచ్ రాజేశ్వరి

వెదురుకుప్పం: మండలంలోని సంతబయలు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి స్థానిక సర్పంచ్ రాజేశ్వరి శాశ్వత పరిష్కారం చూపారు. గ్రామంలో 150 కుటుంబాలు ఉన్నాయి. తాగునీటి కోసం 2 చేతిబోర్లు, బోరు మోటార్లు 2 ఉన్నాయి. ఉన్న బోర్లలో నీరు సక్రమంగా రావడం లేదు. వేసవిలో అయితే బోర్లలో నీటిమట్టం తగ్గి తాగునీటి కొరత ఏర్పడేదని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో గతంలో స్థానిక సర్పంచ్ రాజేశ్వరి 6 బోర్లు వేయించినా చుక్క నీరు రాక పోవడంతో దాహార్తి తీరలేదు. ఈ క్రమంలో సమస్యను అధికారులు, ఎంపీపీ నాగరాణి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయడంతో సోమవారం కొత్తగా బోరు వేయించారు. ఇందులో నీళ్లు పుష్కలంగా పడడంతో నీటి సమస్య తీరిందని గ్రామస్తులు ఆశాభావ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు బట్టే సుబ్రమణ్యం, మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

ఔషధాల ఉసిరి

రోగనిరోధక శక్తి పెరుగుదల కోసం సి-విటమిన్ ఎక్కువగా ఉండే పండ్లు కూరగాయలు తీసుకోమని డాక్టర్లు సలహాలు ఇస్తుంటారు. కరోనా పుణ్యమా అని ఈ విషయం మాటలు సరిగ్గా రాని పసివాళ్ల నుంచి చదువురాని వృద్ధుల వరకూ అందరికీ నోటిమాటగా మారిపోయింది. అయితే ఆ విటమిన్ ఎక్కువగా ఉండే పండు ఏదీ అంటే మాత్రం నారింజ అనో, నిమ్మ అనో చెబుతారు. కానీ అందులో తొలి స్థానం మన ఉసిరి ముందుంది.

- సర్వరోగ నివారిణి ఉసిరి
- షుగర్, బీపీ నియంత్రణకు ఉపయోగకరం

విజయపురం: ప్రకృతిలో ఆరోగ్యఫలాలను అందించే చెట్లు ఎన్నో ఉన్నాయి. అయితే అటు ఆరోగ్యంతో పాటు ఇటు దైవ సమానంగా పూజలందుకునే చెట్లు కొన్నే ఉంటాయి. అలాంటి పవిత్ర వృక్షాలలో ఒకటి ఉసిరి. దేవ దానవ సంగ్రామంలో కొన్ని అమృత బిందువులు పొరపాటున భూమ్మీద పడడంతో పుట్టిందే ఉసిరి అన్నది ఓ కథనం. కార్తీక మాస పూజలు, వ్రతాల్లో ఉసిరికి విశిష్ట స్థానం ఉంది. అప్పటినుంచీ మొదలైన ఉసిరి కాయలు వేసవి వరకూ కాస్తూనే ఉంటాయి. వృద్ధాప్యాన్ని దరి చేరనివ్వని ఔషధ మొక్కల్లో ఉసిరి ఎంతో ఉత్తమం. ఆయుర్వేద వైద్యానికి ఉసిరే కీలకం. అందుకే ప్రతీ వ్యక్తీ తన జీవిత కాలంలో ఐదు ఉసిరి మొక్కలయినా నాటాలని పెద్దవాళ్లు చెబుతారు. ఉసిరిని సంస్కృతంలో ఆమ్లా లేదా ధాత్రీఫలం అని పిలుస్తారు.

80శాతం నీరు

వంద గ్రాముల రాతి ఉసిరిలో 80 శాతం నీరు, కొద్ది పాళ్లలో ప్రొటీన్లు, పిండిపదార్థాలు, పీచూ లభిస్తాయి. 470- 680 మి.గ్రా. సి-విటమిన్ లభ్యమవుతుంది. కాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్, పొటాషియం... వంటి ఖనిజాలూ ఉసిరిలో దొరుకుతాయి. ఇతర పండ్లలో మాదిరిగానే ఇందులో పీచూ ఎక్కువే.

సర్వరోగ నివారిణి

- ఉసిరి త్రిదోషహరిణి అంటోంది ఆయుర్వేదం. అన్ని అవయవాలూ సమన్వయంతో పనిచేసేలా చేస్తుంది. పరగడుపున కాస్త ఉసిరి పొడిని నీళ్లలో కలుపుకుని తాగితే దీర్ఘకాలిక దగ్గు, అలర్జీ, ఆస్తమా, టీబీ... వంటివన్నీ తగ్గుతాయి. ముఖ్యంగా జలుబుతో బాధపడేవాళ్లు రెండు టీ స్పూన్ల ఉసిరి పొడి, తేనె కలిపి పేస్టులా చేసుకుని రోజుకి రెండు లేదా మూడుసార్లుగా తింటే చాలావరకూ తగ్గుతుందట.
- ఎండు ఉసిరి జీర్ణసంబంధమైన అన్ని సమస్యలనూ నివారిస్తుందని.. భోజనం తరువాత తింటే మరీ మంచిదనీ అంటారు. ఇది జీవక్రియను పెంచడంతోపాటు ఇందులోని పీచు ఆకలినీ తగ్గిస్తుంది. దాంతో ఊబకాయాన్నీ అడ్డుకోవచ్చు.
- కాలేయ వ్యాధులకు ఉసిరి దివ్య ఔషధం. శరీరంలోని విషతుల్యాలనూ తొలగిస్తుంది. డయేరియా డీసెంట్రీలనీ ఉసిరి తగ్గిస్తుంది. మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. తద్వారా జ్ఞాపకశక్తి, తెలివితేటలు పెరుగుతాయని. నెలసరి సమస్యలను తగ్గించి, సంతానోత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతుందని.. వీర్యసమృద్ది తోడ్పడుతుందని చెబుతారు.
- ఊపిరితిత్తుల వ్యాధులకు ఉసిరిని మించిన మందు మరొకటి లేదట. రోజూ ఓ ఉసిరికాయని తింటే కఫ సమస్యలన్నీ తొలగిపోతాయి. ఉసిరికాయలను ముద్దగా చేసి తలకు పట్టిస్తే కళ్ల మంటలు తగ్గుతాయి. ముఖ్యంగా ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్రీరాడికల్స్ కారణంగా కణాలు దెబ్బతినకుండా చేయడంతో చర్మం త్వరగా ముడతలు పడకుండా ఉంటుంది.
- ఇది రక్తప్రసారాన్ని మెరుగుపరుస్తుందని గ్యాస్ట్రిక్ సమస్యలు, కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. ఇందులో ఉండే క్రోమియం.. ఇన్సులిన్ స్రావాన్ని పెంచడం ద్వారా చక్కెర నిల్వలను తగ్గించి గుండె జబ్బులు, మధుమేహం వంటివి రాకుండా అడ్డుకుంటుందని తేలిందట. కొన్ని రకాల క్యాన్సర్లను సైతం తగ్గించగల గుణాలు ఉసిరికి ఉంది. ఎలా చూసినా ఉసిరిలో రోగ నిరోధకశక్తిని పెంచే లక్షణాలు అనేకం. అందుకే మనదేశంలో పండే ఈ ఉసిరిని పొడి, క్యాండీలు, రసం, ట్యాబ్లెట్ల రూపంలో నిల్వచేసి ప్రపంచవ్యాప్తంగా విక్రయిస్తున్నారు.

సౌందర్య లహరి

ఉసిరి ఎంతో మేలు చేస్తుంది. రోజూ తాజా ఉసిరిని తినడం లేదా దాని గుజ్జుని కుదుళ్లకు పట్టించడం వల్ల శిరోజాలు బాగా పెరగడంతో పాటు నల్లగా ఉంటుంది. చుండ్రును తగ్గిస్తాయి. అలాగే ఇందులోని సి-విటమిన్ ఎండ నుంచి, చర్మరోగాల నుంచి కాపాడడమే కాదు, శరీరానికి మంచి మెరుపును ఇస్తుంది. రోజూ ఓ ఉసిరికాయను తింటే కాల్షియం శోషణ పెరుగుతుంది. ఎముకలు, దంతాలు, గోళ్లు, వెంట్రుకలు ఆరోగ్యంగా ఉంటాయి. అందుకే మరి, తాజాగా, ఎండు పండుగా, ట్యాబ్లెట్‌గా లేదా పొడి రూపంలో ఎలా తీసుకున్నా ఉసిరి... అందాన్ని, ఆరోగ్యాన్ని సంరక్షించే అద్భుత ఔషధ సిరి.



విజయపురంలో ఉసిరి చెట్టు

పోషక సిరి



అరటిపండు, ఆపిల్ పండు మాదిరిగా ఉసిరి కాయను కొరికి తినడం కష్టమే... ఎందుకంటే పులుపు ఎక్కువగా ఉంటుంది. కానీ ఆ పులుపే ఈ పండుకున్న బలం. కమలాలతో పోలిస్తే ఉసిరిలో విటమిన్-సి 20 రెట్లు ఎక్కువ. ఆపిల్‌లో కన్నా మూడురెట్లు ప్రొటీన్లు ఎక్కువ. ఇతర పండ్లలో కన్నా యాంటీ ఆక్సిడెంట్లూ మరింత ఎక్కువే. మొత్తంగా సర్వరోగాలకు ప్రకృతి ప్రసాదించిన వరమే ఉసిరి. అందుకే దీన్ని ‘సర్వదోషహర’ అనీ పిలుస్తారు.

రేపటి నుంచి మహా కుంభాభిషేక పూజలు



విద్యుత్‌దీపాలతో అలంకరించిన ఆలయం

బంగారుపాళెం: మండలంలోని పాలేరు జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీషిరిడి సాయి బాబా ఆలయ మహా కుంభాభిషేక కార్యక్రమాన్ని ఈ నెల 4న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు శ్రీ గణపతి పూజ, పుణ్యాహవాచనం, అనుజ్ఞ, గణపతిహోమం, నవగ్రహ హోమం, లక్ష్మీహోమం, నవగ్రహ, ధనపూజ, గోపూజ జలాధివాసం, ధాన్యాధివాసం, బింబశుద్ధి, పూర్ణాహుతి, సాయంత్రం 5 గంటలకు మృత్సంగ్రహణం, వాస్తుశాంతి, వాస్తుహోమం, అంకురార్పణం, ఆదివాస యాగ పూజ, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 8 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనం, సోమనాథ పూజ, యాగపూజ, నారాయణహోమం, పూర్ణాహుతి, సాయంత్రం 6 గంటలకు యంత్ర స్థాపనం, రత్నంన్యాసం, విగ్రహప్రతిష్ఠ, బ్రహ్మ, విష్ణు, రుద్ర హోమం, తత్వహోమం, పూర్ణాహుతి, 4న శుక్రవారం ఉదయం 7 గంటలకు గణపతి పూజ, అవబృదయాగ పూజ, 9 గంటలకు ఉద్వాసనం, 9.30 గంటలకు శిఖర కుంభాభిషేకం, 9.45 గంటలకు శ్రీ షిరిడి సాయిబాబా కుంభాభిషేకం, అనంతరం భక్తులకు బాబా దర్శనం ఉంటుందన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. ఆలయ కుంభాభిషేకానికి మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరు కానున్నారన్నారు.

ఏపీయూడబ్ల్యూజే కమిటీ నియామకం



నూతన కార్యవర్గ సభ్యులు

శ్రీరంగరాజపురం: గంగాధరనెల్లూరు నియోజకవర్గం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఏపీయూడబ్ల్యూజే నూతన కార్యవర్గం కమిటీని సోమవారం మండలంలోని జీడీనెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గ సభ్యులు ఆర్.జయప్రకాష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఐవీ సుబ్బరావు, జిల్లా అధ్యక్షుడు లోకనాథం, చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమేష్ ఆదేశాలతో గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఏపీయూడబ్ల్యూజే నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా తిరుమల, ఉపాధ్యక్షులుగా ఎంజీఆర్, రఘునాథరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రోహిత్, సంయుక్త కార్యదర్శులుగా రాజయ్య, విజయ్ కుమార్, ట్రెజరర్‌గా నరేష్, కార్యనిర్వాహక సభ్యులుగా పలువురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్ కార్యవర్గ సభ్యులు వెంకటేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపులకు మరమ్మతులు



చేతిపంపును మరమ్మతు చేయిస్తున్న సర్పంచ్

విజయపురం: మండలంలో పాడైపోయిన చేతిపంపులకు సర్పంచ్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. పన్నూరు దళితవాడలోని మరమ్మతులకు గురైన చేతిపంపులను సోమవారం సర్పంచ్ కుమార్ బాగు పన్నూరు ఆదిఆంధ్రవాడలో 2, దళితవాడ, పిలాసిపాలెం రోడ్డులో ఉన్న మొత్తం 4 చేతిపంపులను ఆయన బాగు చేయించారు. వేసవిలో తాగునీటి కష్టాలు రాకుండా ముందస్తుగా పాడైన చేతిపంపులను గుర్తించి, మరమ్మతులను చేసినట్లు సర్పంచ్ తెలిపారు.



మరమ్మతు అనంతరం పనిచేస్తున్న చేతిపంపు

అరుణగిరిపై ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలు, పెరుగు, కుంకుమ, విబూధితో పాటు నారకేళి జలాలతో అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. పచ్చికాపల్లం పంచాయతీ నక్కలాంపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చంగల్రాయులు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అదేవిధంగా చవటగుంటలోని ఆవుదేవర నందీశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేపట్టారు.

ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

పాలసముద్రం: మండలంలోని కృష్ణజమ్మపురం గ్రామంలో వెలసిన ఎల్లమ్మతల్లికి సోమవారం గ్రామస్తులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు పొంగళ్ల, పూజాసామగ్రిని తీసుకుని పంబవాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం భక్తులు తీసుకొచ్చిన సుగంధ పుష్పాలతో అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మొక్కుబడి ఉన్న భక్తులు పిండిదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. నేడు పొంగుపాలు తీయుట, అమ్మవారికి పాలాభిషేకం, అమ్మవారి ఎదుట అగ్గితొక్కుట, అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు.



సుందరంగా అలంకరించిన ఎల్లమ్మతల్లి



అమ్మవారికి పొంగళ్లు తీసుకొస్తున్న మహిళలు

భక్తి శ్రద్ధలతో రంజాన్

నగరి: రంజాన్ సందర్భంగా పట్టణంలోని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక జామియా, మక్కా మసీదులోను, మీరాసాహెబ్ పాళెం, వేలావడి మసీదుల్లో మత పెద్దలు ధార్మికోపన్యాసం చేశారు. బస్టాండు ప్రాంగణంలో మతపెద్ద ముస్లింలకు ఖురాన్ సందేశాన్ని వినిపించారు. మసీదు ఆవరణలో రద్దీ పెరగడంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మసీదు ప్రాంగణంలో గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. ముస్లింలు మధ్యాహ్నం పేదలకు దానధర్మాలు చేశారు. రామానాయుడు కాలనీలో టగ్ ఆఫ్ వార్ (తాడు లాగే ఆట)తో సరదాగా గడిపారు.

ఉపవాస దీక్షల విరమణ

నింద్ర: పవిత్ర రంజాన్ సందర్భంగా ముస్లింలు ఉదయమే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నెల రోజులుగా ఉపవాస దీక్షలను ఆచరించిన వారు సోమవారం విరమించారు. మసీదులో మత పెద్దల బోధనలను అనుసరించాలని కోరారు.

ఘనంగా రంజాన్

విజయపురం: వడమాలపేట, విజయపురం మండలాల్లోని ముస్లింలు నెల రోజులపాటు ఉపవాస దీక్షలు ఆచరించి, సోమవారం రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పూడి గ్రామంలోని మసీదు వద్దకు భారీగా తరలివచ్చిన ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు రంజాన్ విశిష్టతను, ప్రత్యేకతను వివరించారు. వడమాలపేట, చింతకాల్వ, వెంగళరాజు కండ్రిగ, పచ్చికాల్వ, పూడి, బాలినాయుడు కండ్రిగ గ్రామాల్లోని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలవ్యాప్తంగా రంజాన్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఏపేరి గ్రామ మసీదులో ఉదయం 7 గంటలకే ఏఎంసీ మాజీ డైరెక్టర్ గఫూర్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేపట్టారు. అదేవిధంగా తాటిమాకులపల్లె, పచ్చికాపల్లంలో కూడా మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు చేశారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: మండలవ్యాప్తంగా ముస్లింలు రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మండలంలో తూగుండ్రం పంచాయతీ ఆవలకొండ గ్రామం, బాలగంగానపల్లి, ఆవులాపూర్, సిద్దేశ్వర కొండ, అబ్బాస్ నగర్ కాలనీలో ఉన్న మసీదుల్లో ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

దాన ధర్మాలకు ప్రతీక రంజాన్

కార్వేటినగరం: దాన ధర్మాలకు ప్రతీక రంజాన్ అని ముస్లిం మతపెద్దలు బోధించారు. సోమవారం మండల కేంద్రంలోని మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అదేవిధంగా పేదలకు దాన ధర్మాలు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. మత పెద్దలు ప్రత్యేక ప్రార్థన అనంతరం రంజాన్ పండుగ విశేషాలను గుర్తు చేశారు. మండలవ్యాప్తంగా పలు గ్రామాల్లో ఉంటున్న ముస్లీం సోదరులు కూడా ప్రత్యేక ప్రార్థనలు చేపట్టి రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం): మండల కేంద్రమైన పెనుమూరులో ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు నూరానీ మసీదు నుంచి ఈద్గాకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ ప్రార్థనలు చేశారు.



వడమాలపేట: పూడి మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలవ్యాప్తంగా ముస్లింలు భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు జరుపుకున్నారు. మసీదుల్లో ప్రార్థనల అనంతరం పేదలకు దాన ధర్మాలు చేశారు. మత సామరస్యానికి, సహృద్భావానికి సర్వమానవ సమానత్వానికి రంజాన్ ప్రధాన ఉద్దేశమని మతపెద్దలు బోధించారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: త్యాగానికి ప్రతీక రంజాన్ అని ముస్లిం మత పెద్దలు తెలిపారు. మండల పరిధిలోని రాచపాళెం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వీకులు చేసిన త్యాగ ఫలితాల విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. త్యాగం, సహనం, పరోపకారం, దైవంపై అచెంచెల విశ్వాసంతో ముందుకు సాగాలన్నారు.



పుత్తూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్

పుత్తూరు: పట్టణంలోనిని స్థానిక ఎన్జీఓ కాలనీ వద్ద గల మసీదులో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు ఖురాన్ సందేశం వినిపించారు. పట్టణంలోని షాపువీధి, గేట్‌పుత్తూరులోని మసీదుల్లోనూ ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు మాహీన్, ఖలీల్, ఇలియాస్, గులాబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



నింద్ర: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



వెదురుకుప్పంలో..



రాచపాళెం మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



నగరి: బస్టాండులో బోధనలు చేస్తున్న మతపెద్ద



శ్రీరంగరాజపురం మసీదులో..



కార్వేటినగరం మసీదులో ముస్లింల ప్రార్థనలు



పెనుమూరు: ఈద్గాకు ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు



నగరి: తాడులాగే ఆటలో ముస్లింలు

ఎమ్మెల్యే సత్య ప్రమాణం చేస్తారా?



మాట్లాడుతున్న గాయత్రీదేవి, హరిణిరెడ్డి, సూర్యప్రతాప్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ కార్యకర్త మురళీరెడ్డిని ఎమ్మెల్యే దుర్భాషలాడలేదని కాణిపాకంలో సత్యప్రమాణం చేస్తారా అని ఆ పార్టీ రాష్ట్ర మహిళా విభాగ ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవి సవాల్ విసిరారు. జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. దాడిచేసిన వారి ఫొటోలు చూపించారు. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టినందుకు మురళీని ఎమ్మెల్యే తిట్టారని ఆ విషయం దారి మళ్లించేందుకు అతనిపై దాడి చేయించారని ఆరోపించారు. ముకుమ్మడిగా 30 మంది ఇంట్లోకి చొరబడి కిటికీలు పగులగొట్టారని చెప్పారు. మురళీపై దాడి చేస్తున్నప్పుడు అడ్డు వచ్చిన అతని భార్య రేఖనూ కొట్టారని వివరించారు. బాధితులు పోలీసులకు సమాచారమిస్తే, రక్షణ కల్పించాల్సింది పోయి కొట్టడానికి వచ్చినవారిని సాగనంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేయడానికి రేఖతో పాటు పోలీసుస్టేషన్‌కు వెళితే వారు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న మురళీని పరామర్శించడానికి విజయానందరెడ్డితోపాటు నాయకులు వెళితే వారిపై కేసు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరులో ఏమి అభివృద్ధిచేశారో ఎమ్మెల్యేకే తెలియాలన్నారు. గతంలో ప్రారంభమైన బీసీ భవన్‌ను తిరిగి ప్రారంభించి గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పార్టీ మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిణిరెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రౌడీయిజంతో ప్రజలను భయపెడుతోందన్నారు. జగనన్న పాలనలో మహిళలకు ఉన్న భద్రత ఇప్పుడు కనిపించడం లేదన్నారు. అధికారపక్షానికి పోలీసులు కొమ్ముకాస్తున్నారని లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. ఇది కొనసాగితే విద్యావేత్తలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు అంజలిరెడ్డితోపాటు నాయకులు నౌషద్, హరీషారెడ్డి పాల్గొన్నారు.